# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 12 ఏప్రిల్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 260

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2వ.

## పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన

సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు





2వ.

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా.. అవి కెసిఆర్ ఎన్నికలే

కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు

అనేక హామీలతో డబ్బా కొట్టిన రేవంత్

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్

ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు.



## దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం

2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు

42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్

బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం

రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి

హైదరాబాద్: కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు.
ఓనియోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు.




## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

అధికారికంగా ప్రకటించిన బోర్డు

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

ఆరు అంతస్తుల అపార్ట్‌మెంటును కూల్చివేస్తున్న బాహుబలి జేసీబీ



అపార్ట్‌మెంటు, పలు నిర్మాణాల కూల్చివేత

861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

విలువ రూ.15 వేల కోట్లకుపైనే..

అమీన్‌పూర్: హైడ్రా యంత్రాంగం శనివారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పరిధిలోని ఐలాపూర్, కిష్టారెడ్డిపేట-బీరంగూడ శివారు ప్రాంతాల్లో భారీ ఆపరేషన్ చేపట్టింది. అన్యాక్రాంతమైన రూ.15 వేల కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ, మున్సిపల్, పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకుంది. తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచే ప్రారంభమైన ఆపరేషన్ రాత్రి వరకు కొనసాగింది. నాలుగు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించింది. బాహుబలి క్రేన్ సహాయంతో ఆరంతస్తుల అపార్ట్‌మెంటును కూల్చివేసింది. మొత్తం 1,263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో 402 ఎకరాల్లో ఇప్పటికే ఉన్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను మినహాయించి మిగిలిన 861 ఎకరాల ప్రభుత్వ భూములే లక్ష్యంగా హైడ్రా ఆపరేషన్ కొనసాగించింది. అక్రమ నిర్మాణాల కూల్చివేత ఇలా.. హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా ఐలాపూర్‌లో 2.20 ఎకరాల్లో ఎంఎ అజీం నిర్మించిన మూడు టవర్లతో కూడిన ఆరంతస్తుల అపార్టుమెంటును కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయా టవర్లలో అద్దెకున్నవారు ఫ్లాట్లను ఖాళీ చేసేందుకు కొంత సమయం ఇవ్వాలంటూ ప్రతిఘటించారు. ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన టవర్ల విలువ రూ.30 కోట్ల మేర ఉంటుందని స్థానికులు తెలిపారు.
విలాసవంతంగా నిర్మించుకున్న ముఖీంకు చెందిన ఇంటితోపాటు చుట్టూ 40 ఎకరాల మేర గడీలు పెట్టి నిర్మాణం చేసిన ఫామ్‌హౌస్, గుర్రపుశాలలను తొలగించినట్లు హైడ్రా అధికారులు ప్రకటించారు. సమీపంలోని మరో వ్యక్తికి సంబంధించిన ఫామ్‌హౌస్‌ను సైతం కూల్చివేశారు. ఈ సందర్భంగా స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. కిష్టారెడ్డిపేట-బీరంగూడ రహదారి వెంట అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లను సైతం తొలగించారు. దీంతో పాటు ఐలాపూర్ రెవెన్యూ శివారులోని ఒకటి నుంచి 220 వరకు ఉన్న సర్వేనంబర్లలోని ఖాళీ స్థలాల చుట్టూ కంచెల నిర్మాణం చేపట్టారు. హైడ్రా కూల్చివేసిన భవనంహైడ్రా వివరాల ప్రకారం2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అప్పటి జాయింట్ కలెక్టర్ ఐలాపూర్ రెవెన్యూలోని 1 నుంచి 220 సర్వేనంబర్‌లోని 1,263 ఎకరాలను ప్రభుత్వ భూమిగా ప్రకటించారు.

## వాటర్ బిల్లు బకాయిల పేరుతో మెసేజ్‌లు



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయని హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వాటర్ బోర్డు బిల్లుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, వారి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ మోసాలు ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పేరుతో జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు.

## బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం



అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు

బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్వ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు.

## అమెరికా, ఇరాన్ ప్రత్యక్ష చర్చలు తొలిసారి షురూ

## నేరుగా.. జోరుగా



1979 తర్వాత అమెరికా, ఇరాన్ ప్రత్యక్ష చర్చలు తొలిసారి షురూ

ఇస్లామాబాద్‌లో జేడీ వాన్స్, ఘాలిబఫ్ బృందాల భేటీ

పాల్గొన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల విడుదలకు అమెరికా అంగీకారం?

మరో రోజుకు పొడిగించాలని సూచించిన పాకిస్థాన్

ఇస్లామాబాద్: యుద్ధం ముగింపునకు అమెరికా, ఇరాన్ మధ్య చరిత్రాత్మక సమావేశం శనివారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగింది. ముందుగా అనుకున్నట్లుగా పరోక్షంగా కాకుండా ఇరు దేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా భేటీ కావడం విశేషం. ఈ చర్చల్లో అమెరికా బృందానికి ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ బృందానికి ఆ దేశ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నాయకత్వం వహించారు. చర్చల్లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. చర్చల సందర్భంగా కీలక అంశాలకు సంబంధించిన తమ తమ డిమాండ్లను రెండు దేశాలు పరస్పరం పంచుకున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించినట్లు సమాచారం. చర్చలను మరో రోజు పొడిగించాలని ఈ సందర్భంగా పాకిస్థాన్ సూచించింది. దీనిపై రెండు దేశాలు స్పందించాల్సి ఉంది. చర్చల అనంతరం రెండు దేశాల ప్రతినిధులు విందులో పాల్గొన్నారు. 'రెండు దేశాల ప్రతినిధులతో ప్రధాని షరీఫ్ విడివిడిగా సమావేశమైన తర్వాత నేరుగా చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా, ఇరాన్ బృందాలు ఒకే టేబుల్‌పై కూర్చున్నాయి. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమయ్యాక నేరుగా చర్చలు జరగడం ఇదే తొలిసారి' అని పాక్ ప్రధాని కార్యాలయ అధికారి ఒకరు వెల్లడించారు.
షరీఫ్‌తో భేటీలుఇస్లామాబాద్ చేరుకున్న అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాలు తొలుత పాక్ ప్రధాని షెహబాజ్, ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌తో భేటీ అయ్యాయి. ఇరాన్ బృందంలో ఘాలిబఫ్, అరాగ్చీ తదితరులున్నారు. వాన్స్ బృందమూ షరీఫ్‌తో సమావేశమైంది.

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 11



మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దుబ్బ లోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో పూలే జయంతి వేడుక నిర్వహించారు. అంతకుముందు వినాయకనగర్ లోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు మహాత్మ జ్యోతిబాపూలే కొనసాగించిన కృషి అమోఘమని అన్నారు. అడుగడుగునా అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం చలించకుండా సాంఘిక దురాచారాలను దూరం చేసేందుకు పూలే ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. అణగారిన వర్గాలు సమానత్వం సాధించాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి వారికి విద్య అందేలా విశేషంగా కృషి చేశారని, మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపింపజేశారని అన్నారు. ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం బీ.సీ గురుకులాలకు జ్యోతిబాపూలే పాఠశాలలుగా నామకరణం చేస్తూ నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మహనీయులు చూపిన బాటలో పయనిస్తూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేసినప్పుడే మన జీవితానికి కూడా సార్థకత చేకూరుతుందన్నారు. జ్యోతిబా పూలే చూపిన బాటలో పయనిస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. జయంతి సభలో మేయర్ ఉమారాణి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ లు మాట్లాడుతూ, జ్యోతిబా పూలే సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల బాధ్యులు బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, నరేందర్ గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పుడు ఎన్నికలొచ్చినా..అవి కెసిఆర్ ఎన్నికలే



హైదరాబాద్: ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుం టున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిాదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మిా ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మిాకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు..

కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మిాకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి
కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం



సిద్దిపేట:పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మిాడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ÷ర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ
డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

### మరోమారు హెచ్చరించిన ట్రంప్



న్యూయార్క్: ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్నర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ మీడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# మహిళా అక్షరాస్యతకు జ్యోతిబా పూలే ఎనలేని కృషి

### అసమానతలను వ్యతిరేకించిన గొప్ప వ్యక్తి..

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా..

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:



మహిళా అక్షరాస్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జ్యోతి బా పూలే జయంతి ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల కోసం సతీమణి సావిత్రి భాయి పూలే తో కలిసి మొట్టమొదటి పాఠశాలను నెలకొల్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాయోధుడు అని తెలిపారు. ప్రధానంగా మహిళల విద్యకు ఆయన చేసిన సేవలు అపూర్వమైనవని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాలని లక్ష్యంతో సత్యశోధ కు సమాజాన్ని స్థాపించారని గుర్తు చేశారు. ఒక మహానుభావుడిని గుర్తు చేసుకోవడం మాత్రమే కాదని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ కూడా మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ప్రజలను మభ్యపెడుతుందన్నారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళిక రూపొందించకుండా మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, కార్పొరేటర్లు జ్యోతి మురళి, మల్లేష్ యాదవ్, బెల్లాల్ శశాంక్, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నలంద విద్యార్థులకు స్టేట్ ర్యాంకుల్లో....

వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:




ఈఖ్యస్ హైదరాబాద్ వారు ఈ విద్యా సంవత్సరం(2025-26) నిర్వహించినటువంటి ఐఐటి, ఒలంపియాడ్ కాంపిటీటివ్ పరీక్షల్లో నలంద విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులను సాధించారు. ఈ ఫలితాలు పాఠశాల విద్యా ప్రమాణాలను మరొకసారి చాటిచెప్పాయి. స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు: సి బ్యాట్ రాష్ట్రస్థాయి పరీక్షల్లో దేవాంశిక (5వ తరగతి) -- స్టేట్ 1వ ర్యాంక్, గుండేటి నిధిన్ (7వ తరగతి) -- స్టేట్ 1వ ర్యాంక్ , ఏ - మ్యాట్ రాష్ట్రస్థాయి పరీక్షలు కే. సాన్విక (5వ తరగతి) -- స్టేట్ 2వ ర్యాంక్, కే. అజిత్ (6వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్, కె. స్నితిక్ వర్మ (7వ తరగతి) -- స్టేట్ 4వ ర్యాంక్, డి. విలక్షణ (6వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్ , గుండేటి నిధిన్ (7వ తరగతి) -- స్టేట్ 2వ ర్యాంక్, ఆర్ ఎస్ఎం రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎం. వెంకట లక్ష్మి (7వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్, కాశం రాజశ్రీ (7వ తరగతి) -- స్టేట్ 2వ ర్యాంక్, పొడపల్లి చిన్మయి (9వ తరగతి) -- స్టేట్ 2వ ర్యాంక్ , అంబల్ల శ్రీమహాలక్ష్మి (4వ తరగతి) -- స్టేట్1వ ర్యాంక్, బి. శివమణి శంకర్ (6వ తరగతి) -- స్టేట్ 1వ ర్యాంక్, టి - ఇఏటి రాష్ట్రస్థాయి పరీక్షల్లో వేధాంత్ (5వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్,
బొద్దు శ్రీయాంశి (5వ తరగతి) -- 3వ స్టేట్ ర్యాంక్, బి - మ్యాట్ రాష్ట్రస్థాయి పరీక్షల్లో కె. నితీష (8వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్, ఎ. హృద్య శ్రీ (8వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్, పి. నితీష (8వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్,
పోకల హారిణి (8వ తరగతి) -- స్టేట్ 1వ ర్యాంక్, కె - ఎస్ఏటి పి. దేవాంశిక (5వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్, ఎన్. సృజన్ రెడ్డి (9వ తరగతి) -- స్టేట్ 1వ ర్యాంక్, ఎన్. స్ఫూర్తి (9వ తరగతి) -- స్టేట్ 3వ ర్యాంక్ సాధించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ అభినందించారు.

# ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది

హైదరాబాద్:పార్లమెంట్‌లో నారీ శక్తి వందనం బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన ప్రవేశ పెట్టనున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. ఎన్నో ఏళ్లుగా ఈ బిల్లు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ బిల్లు అమలైతే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కుతుందని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు పెట్టారని.. ఈనెల 16, 17, 18 తేదీల్లో సెషన్ జరగనుందని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీలు మహిళా బిల్లును వ్యతిరేకించాయని తెలిపారు. గతంలో చాలామంది ఈ బిల్లు తేవాలని చూశారు.. తప్ప ఎవరి వల్ల అది సాధ్యమవ్వలేదని.. కానీ మోదీ ఈ బిల్లును సుసాధ్యం చేయనున్నారని అన్నారు. చట్టం చేయడమే కాదని.. అమలు చేయడంపైనా కసరత్తు జరుగుతోందని చెప్పారు. పార్టీకలతీతంగా ఈ బిల్లుకు మద్దతు పలకాలని సూచించారు. మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఎంపీ డీకే అరుణ ఆకాంక్షించారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ.. ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తోందని ఉద్ఘాటించారు. చట్టసభల్లో కూడా మహిళలు ఉంటే ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల్లో వారికి ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆర్థిక, విద్య, ఉపాధి వంటి అన్ని రంగాల్లో తమ మార్క్ చూపిస్తారని వివరించారు. భారత ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తారన్నారు. ఈ బిల్లును అడ్డుకోవాలనే ఆలోచనను మార్చుకోవాలని చెప్పారు. మహిళలకు గౌరవాన్ని పెంచాలని సూచించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి ఎంతో సమయం లేదని.. కానీ మహిళా శక్తికి రాజకీయ శక్తి తోడైతే వికసిత్ భారత్ లక్ష్యానికి సులువుగా చేరుకోవచ్చని వివరించారు. ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే క్రెడిట్ బీజేపీకి ఎక్కడ పోతుందోనని ఆలోచించకుండా పార్టీలకతీతంగా మద్దతు తెలపాలని అన్నారు. మహిళలను తక్కువ అంచనా వేస్తున్నారనే అపవాదును దేశానికి తీసుకురావద్దని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని ఎంపీ డీకే అరుణ కోరారు. ఇది ఒక చట్టం కాదని.. కోట్లాది మంది మహిళల ఆశ, ఆశయమని ఉద్ఘాటించారు. చట్టానికి ఆమోదం తెలిపితే కొత్త శకానికి నాంది పలకనుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో ప్రస్తుతం ఇద్దరు మహిళలమే ప్రాతినిధ్యం వహిస్తున్నామని వివరించారు. ఈ బిల్లు అమలైతే స్థానాలు పెరుగుతాయని చెప్పుకొచ్చారు. డీ లిమిటేషన్ కూడా పూర్తయితే తెలంగాణ నుంచి 9 మంది మహిళలు పార్లమెంట్‌లో అడుగు పెడతారని తెలిపారు. తెలంగాణలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 180 వరకు పెరుగుతాయని.. అంటే 60 మంది మహిళలు అసెంబ్లీలో ఉంటారని ప్రస్తావించారు.ఎస్సీ, ఎస్టీలకు కూడా మంచి అవకాశాలు రానున్నాయని వివరించారు. ఇది తాత్కాలికం కాదని.. మూడు టర్మ్‌ల వరకు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు.?

# లాయర్ ఫిర్యాదుకు ప్రతిగా మంగ్లీ కేసు

హైదరాబాద్:ప్రముఖ సింగర్ మంగ్లీ తనను సుభా సియపోగు అనే న్యాయవాది వేధిస్తున్నానంటూ నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అప్రతిష్ఠ పాలు చేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తాను రూ.150 కోట్ల మోసానికి పాల్పడ్డానంటూ సుభా సింగబోష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంగ్లీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. మార్చి 21న సుభా సియపోగు పేరుతో ఒక వ్యక్తి తనను పరిచయం చేసుకున్నాడని,
అప్పటి నుంచి అమర్యాదగా, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. తనను కలవాలని సదరు వ్యక్తి తీవ్ర ఒత్తిడి చేశాడని, అందుకు నిరాకరించడంతో సోషల్ మీడియాలో, బయట అప్రతిష్ఠ పాలు చేస్తానని బెదిరించినట్లు మంగ్లీ ఆరోపించారు. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియోలను చూపించి, మరో వ్యక్తితో కలిసి తనపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ పరిణామాల వల్ల తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, తన వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన నార్సింగి పోలీసులు, నిందితుడు సుభా సింగబోష్‌పై బిఎన్ఎస్ సెక్షన్లు 79, 351(3) కింద కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటికే మంగ్లీపై పంజగుట్ట స్టేషన్‌లో న్యాయవాది కేసు నమోదు చేశారు. దీంతో పరస్పరం కేసులు నమోదు అయ్యాయి.

# 20న మోతెలో భారీ బహిరంగ సభ

### సభాస్థలిని పరిశీలించిన బిఆర్ఎస్ నేతలు

జగిత్యాల: జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు,
ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

# న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది

విశాఖపట్నం: చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు. వివిధ దేశాల్లో చిక్కుకున్న180 మందిని కూడా రక్షించామని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా నూతన టెక్నాలజీతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే.. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# జ్యోతిరావు పూలేకు భారతరత్న ఇవ్వాలి.

















•ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్.

•సమాజ మార్పుకు సృజనాత్మకత అవసరం.

•పూలే-అంబేడ్కర్ ఆలోచన వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య ఎం.ఏ. మహమ్మద్ అబ్దుల్ మాలిక్.

•ఘనంగా "సత్యశోధక్" పాఠశాల రజతోత్సవాల వేడుకలు.

•పాల్గొన్న నారగొని, ప్రొ" లింబాద్రి, పాఠశాల యాజమాన్యం రావుట్ల నర్సయ్య.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

మహాత్మా జ్యోతిరావు పూలేకు భారతరత్న పురస్కారంతో గౌరవించాలని ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ డిమాండ్ చేశారు. పూలే 199వ జయంతి సందర్భంగా సిరికొండలోని సత్యశోధక్ పాఠశాల రజతోత్సవాలతో పాటు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాహెర్ మాట్లాడుతూ.. పూలే దృష్టిలో నిజమైన స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛ కాదని, సామాజిక స్వేచ్ఛ కూడా అని పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్ ఆచార్య లింబాద్రి మాట్లాడుతూ .. పూలే చూపిన దారిలో నడవాలంటే ముందుగా మనలోని వివక్ష భావాలను తొలగించుకోవాలని హితవు పలికారు. సమానత్వం, మానవత్వం అనే విలువలను మనమే ఆచరణలో పెట్టాలన్నారు.

**సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ సలహాదారు, పూలే--అంబేడ్కర్? ఆలోచన వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య ఎం.ఏ. మహమ్మద్ అబ్దుల్ మాలిక్‌మాట్లాడుతూ,**

సృజనాత్మక వినాశ సిద్ధాంతం గురించి వివరించారు. దేశం అభివృద్ధి చెందాలంటే పాత వ్యవస్థను తొలగించే సృజనాత్మక వ్యవస్థను రూపొందించాలని, ఆ బాధ్యత నేటి యువతపై ఉందని పేర్కొన్నారు. ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన డా. మహమ్మద్ అబ్దుల్‌మాలిక్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యశోధక్ పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య, తెలంగాణ కాలేజియేట్ సంయుక్త సంచాలకులు ఆచార్య. బాలభాస్కర్, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫోరం అధ్యక్షులు వీజీఆర్ నారగోని, సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ సలహాదారు అడ్వకేట్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మృతి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



సిపియం అనుబంధ కార్మిక సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న నూర్జహన్ శనివారం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడకు చెందిన నూర్జహన్ కొంత కాలం పీపుల్స్ వార్ పార్టీలో పనిచేశారు. అనంతరం సిపిఎం పార్టీలో చేరి అంచలంచెలుగా రాష్ట్ర నాయకురాలిగా ఎదిగారు. ఆశ, అంగన్ వాడీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలపై జరిగే ఆందోళన కార్క్రమాల్లో ముందుండి పాల్గొనే వారు. గతంలో అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికలలోను నూర్జహన్ సిపియం తరుపున పోటీ చేశారు. కామ్రేడ్ నూర్జహన్ ఆకస్మిక మరణం పట్ల ప్రజా సంఘాల నాయకులు పెద్ది వేంకట్రాములు, దండి వేంకటి, ఎ. రమేష్ బాబు, సుధాకర్, ఓమయ్య, వి. ప్రభాకర్, వనమాల క్రిష్ణ, ముస్కే సుధాకర్, వామపక్ష పార్టీల నాయకులు తదితరులు సంతాపం తెలిపి ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం బాన్సువాడలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## హిందువుల సంఘటితం కోసమే సంఘ్ స్థాపన.











**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్.**

**కందకుర్తిలో హెడ్గేవార్ కేశవ స్ఫూర్తి మందిర్ ప్రారంభోత్సవం.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

హిందువుల సంఘటితం కోసమే ఆనాడు సంఘ్ స్థాపన జరిగిందని, దేశానికి బ్రిటిషర్ల నుంచి విముక్తి కల్పించాలనే ఉద్దేశంతోనే కేశవరావు బలిరాంపంత్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ను స్థాపించారని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా, రెంజల్ మండలం, కందకుర్తిలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటిని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దుతూ నిర్మించిన శ్రీ కేశవ స్ఫూర్తి మందిర్ ను ఆయన శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా హెడ్గేవార్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి ఆర్ట్ గ్యాలరీని తిలకించారు.. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. కందకుర్తి ప్రాంతానికి పౌరాణిక చరిత్ర ఉందని.. యుగాల కిందట తన తల్లి వినత దాస్య విముక్తి కోసం గరుత్మంతుడు దేవలోకం నుంచి అమృతాన్ని కందకుర్తికే తీసుకొచ్చినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయన్నారు. హిందూ సమాజంలో ఐక్యత కోసం హెడ్గేవార్ జీవితాన్ని ధారబోశారని చెప్పారు. ఆయన మూలాలు కందకుర్తి లోనే ఉన్నాయన్నారు. ప్రతి భారతీయుడు ఈ కేంద్రాన్ని సందర్శించి స్ఫూర్తి పొందాలని మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ఎస్ ఎవరినో వ్యతిరేకించేందుకో, మరెవరినో చంపేందుకో ఏర్పాటు కాలేదని.. దేశంలోని ప్రజల ఐక్యత కోసం ఏర్పడిందన్నారు. ఆ దిశ గానే సంఘ్ పనిచేస్తోందన్నారు.

భారతీయులంతా ఒక్కటేనన్న మూల సూత్రం వైపు నడిపించడమే సంఘ్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్య నారాయణ గుప్తా, పైడి రాకేశ్ రెడ్డి, పాయల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ సారి వర్షాలు తక్కువే

హైదరాబాద్: ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే అంతగా వర్షాలు మాత్రం పడవని వాతావరణ సంస్థ ప్రకటించింది. తాజాగా తెలంగాణలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బలమైన ఎల్-నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేసింది. 2026 వర్షపాతానికి సంబంధించిన అంచనాలు తెలంగాణలో కొంత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా తెలంగాణలో మంచి వర్షాలు పడ్డాయని.. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. రైతులు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే, 2026లో పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించింది. 2018 సంవత్సరం తరహాలో ఈసారి వర్షపాతం ఉండొచ్చని అంచనా వేసింది. జూన్- సెప్టెంబర్ కాలంలో అన్ని నెలలూ 'సగటు కంటే తక్కువ' వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. కానీ, 2014-15 సంవత్సరాల మాదిరిగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్ వంటి ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తే

అవకాశం ఉండడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మేరకు నీటి వనరులను అన్నదాతలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. వరి వంటి ఎక్కువ నీరు అవసరమైన పంటలకు బదులుగా పప్పు, జొన్న వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని చెబుతున్నారు.

## నియోజకవర్గానికో మీడియా హౌజ్

**అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన ఎంపి**

అంబాజీపేట: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మీడియా హౌస్ నిర్మిస్తామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి అనేక సమస్యల పరిష్కారానికి దిక్సూచి వంటి వారని మీడియా ప్రతినిధులను కొనియాడారు. ది అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్టు అంబాజీపేట ప్రెస్ క్లబ్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పళ్ళ సూర్యప్రకాశరావు(బాబ్జి) అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ హరీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విలేకరులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో సుస్థిర పరిస్థితులకు మీడియా పాత్ర మరింత కీలకమని ఎంపీ గుర్తు చేశారు. మీడియా అక్రెడిటేషన్, రైల్వే పాస్ తదితర సదుపాయాల గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. తన తండ్రి బాలయోగిపై చూపిన అభిమానం, ఆదరణ నాపై కూడా చూపాలని ఈ సందర్భంగా జర్నలిస్టు లను కోరారు. అనంతరం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, పత్రికా విలేకరులు సమాంతరంగా పనిచేసినప్పుడే సంఘంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు.తన నియోజకవర్గంలో కొంత మంది విలేకరులు తనపై బురద చ్లలె ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలను నిర్భయంగా తెలిపే పత్రికలకు, వాస్తవాలను ఎటువంటి పక్షపాతం లేకుండా ఉన్నది ఉన్నట్లు రాసే జర్నలిస్టులకు సమాజంలో దానంతట అదే గుర్తింపు ఉంటుందని ఎంఎల్ఎ గుర్తు చేశారు. పి.గన్నవరం అక్విడెక్ట్ రిపేర్ల విషయంలో పలు నిందారోపణలు చేస్తూ పలు వార్తలను కొందరు రాయడం తగదన్నారు.

# డెకాయిట్ నిర్మాతపై సమంత ఎమోషనల్ పోస్ట్ రిలీజ్‌కు ముందే భారీ

అంచనాలను సొంతం చేసుకున్న డెకాయిట్ సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టా
మారింది.

రిలీజ్‌కు ముందే భారీ అంచనాలను సొంతం చేసుకున్న డెకాయిట్ సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కంటెంట్‌పై నమ్మకంతో రూపొందిన ఈ సినిమా, దేశీయంగానే కాకుండా ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా మంచి అడ్వాన్స్ బుకింగ్స్ నమోదు చేసుకుంటూ ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. నూా క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా, ఓ వైపు కమర్షియల్ అంచనాలు పెంచుతుండగా, మరోవైపు భావోద్వేగ అనుబంధాలతో కూడిన కథనంగా కూడా నిలుస్తోంది. ఈ సినిమా చుట్టూ మరింత చర్చకు దారితీసిన అంశం స్టార్ హీరోయిన్ సమంత చేసిన ఎమోషనల్ పోస్ట్. డెకాయిట్ సినిమా నిర్మాత సుప్రియ యార్లగడ్డపై ఆమె వ్యక్తపరిచిన ఎమోషనల్ బాండింగ్ మూవీకి కొత్త హైప్‌ను తీసుకువచ్చింది. "నీ కష్టం, నీ పట్టుదల నాకు తెలుసు" అంటూ సుప్రియను ఉద్దేశిస్తూ సమంత తన పోస్ట్ లో పేర్కొనడం కేవలం ప్రమోషన్ కోసమే కాకుండా, ఒక నిజమైన గౌరవాన్ని ప్రతిబింబించింది. సుప్రియా యార్లగడ్డ ప్రయాణం కూడా ఈ సినిమా విజయకథలో ముఖ్య భాగంగా నిలుస్తోంది. తన తండ్రి స్థాపించిన నూా క్రియేషన్స్ బ్యానర్‌ను మళ్లీ తెరపైకి తీసుకురావడం ద్వారా ఆమె ఒక ఉమెన్ ప్రొడ్యూసర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇండస్ట్రీలో మహిళలకు ఉన్న సవాళ్ల మధ్య, కంటెంట్‌పై నమ్మకంతో తీసుకున్న ఈ నిర్ణయం ఆమెను ప్రేరణాత్మక వ్యక్తిగా నిలబెడుతోంది. ఫ్యామిలీ లెగసీని కొనసాగిస్తూ కొత్త తరానికి అనుగుణంగా ప్రాజెక్ట్‌ను నిర్మించడం ఆమె విజన్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ఇక దాకోయిట్ కు వస్తున్న ఇండస్ట్రీ సపోర్ట్ కూడా విశేషమే. ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు ఈ సినిమాకు మద్దతు తెలపగా, ఇప్పుడు సమంత కూడా ఆ జాబితాలో చేరడం ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచింది. ఒక సినిమా విడుదలకు ముందే ఇంత విస్తృత స్థాయిలో సపోర్ట్ రావడం అరుదైన విషయంగా చెప్పాలి. బజ్ విషయానికి వస్తే, రిలీజ్‌కు ముందే ఈ సినిమా రికార్డ్ స్థాయి క్రేజ్‌ను సంపాదించింది. అడ్వాన్స్ టికెట్ సేల్స్ మంచి స్థాయిలో ఉండటం, ఆడియన్స్‌లో ఉన్న ఆసక్తిని సూచిస్తోంది. ఇది కేవలం స్టార్ పవర్ వల్ల వచ్చినది కాకుండా, కంటెంట్‌పై ఉన్న నమ్మకం కారణమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ూాశ్రీంశీ =ముఃు – రష్మిక.. దాన్ని లైఫ్ లో ఎప్పటికీ మర్చిపోలేరా? అడివి శేష్ మరోసారి కంటెంట్ డ్రివెన్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తన కెరీర్‌లో విభిన్నమైన కథల ఎంపికతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, ఈ సినిమాతో మరో స్ట్రాంగ్ స్క్రిప్ట్‌ను అందిస్తారా అన్న ఆసక్తి నెలకొంది. పైగా మృణాల్ లాంటి టాలెంటెడ్ భామ హీరోయిన్‌గా ఉండటం కూడా ఈ సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మొత్తంగా చూస్తే, డెకాయిట్ కు ఇండస్ట్రీ సపోర్ట్ మరియు బాక్సాఫీస్ హైప్ కలిసి ఈ సినిమాను మస్ట్ వాచ్‌గా మార్చుతున్నాయి.





## కథలో బలం లేకున్నా కథనంలో కొత్తదనం

డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించుకుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ .




## డెకాయిట్..అడవి శేష్ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన

నటుడు నాని ప్రత్యేక అభినందనలు

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ 'డెకాయిట్' శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని ఈ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించాడు. అడివి శేష్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ ప్రదర్శన అని, 'డెకాయిట్' ఒక నిజమైన బ్లాక్ బస్టర్ అని ఎక్స్ వేదికగా కొనియడారు. 'డెకాయిట్' సినిమా ప్రీమియర్ చూసిన అనంతరం నాని తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ, 'డెకాయిట్.. ఒక నిజమైన బ్లాక్ బస్టర్! ఈ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అస్సలు మిస్ కావద్దు. అడివి శేష్ అద్భుతంగా నటించాడు, తన కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్. అడివి శేష్‌కు, రచయిత అబ్బూరి రవి గారికి, స్క్రీన్ ప్లే విభాగానికి నా అభినందనలు అని నాని పేర్కొన్నారు. అలాగే హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, 'మృణాల్.. ఈ పాత్రలో నువ్వు చాలా అందంగా లీనమైపోయావు. నీ ఖాతాలో మరో గొప్ప సినిమా చేరింది' అని ప్రశంసించారు. చిత్ర దర్శకుడు షనీల్ డియో పనితీరును, సంగీతాన్ని మరియు విజువల్స్‌ను నాని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈ ఏడాదిలోనే ఒక అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని నాని కొనియాడారు. నాని చేసిన పోస్ట్‌పై అడివి శేష్ స్పందిస్తూ, థాంక్యూ సో మచ్ బిగ్ బ్రో. మీ రివ్యూ చూశాక మా టీమ్ అంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. మీ మాటలు నాకు ఎంతో ప్రత్యేకం. నిజంగా నా మనసు నిండిపోయిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాకు ప్రీమియర్ నుంచే పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో




## నటుడు ప్రభాస్ లెజెండ్

దురంధర్ దర్శకుడు ఆదిత్యధర్ కితాబు

బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ ఆదిత్య ధర్ మన రెబల్ స్టార్ ప్రభాస్ కు 'లెజెండ్' అంటూ కితాబిచ్చేశారు. రెబల్ స్టార్.. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ఇవి ప్రభాస్ ను ఫ్యాన్స్ ముద్దుగా పిలుచుకునే పేర్లు. ఈశ్వర్ తో మొదలైన ప్రభాస్ జర్నీ నేడు దేశం గర్వించే రేంజ్ కు చేరుకుంది. కానీ మన డార్లింగ్ చాలా సింపుల్ గా కూల్ గా ఉంటాడు తప్ప స్టార్‌డమ్ గురించి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. ఎంతటి వారైనా ప్రభాస్ తో కలిసి వర్క్ చేసారంటే ప్రేమలో పడిపోవాల్సిందే. తాజాగా ఇటీవల సందీప్ రెడ్డి వంగాతో కలిసి 'ధురంధర్ 2' సినిమాను వీక్షించారు ప్రభాస్. అయితే, సినిమా చూసి సైలెంట్‌గానే వెళ్ళిపోయాడు డార్లింగ్. కనీసం సోషల్ మీడియాలో రివ్యూ కూడా ఇవ్వలేదు. కానీ, ఆ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా చేసిన పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన ఆదిత్య.. 'ది లెజెండ్ ప్రభాస్ సర్‌కి నా ప్రేమను తెలియజేయండి' అంటూ ట్వీట్ చేశారు. ఇక్కడి నుంచి సోషల్ మీడియాలో లెజెండ్ ప్రభాస్ ట్యాగ్స్ ఓ రేంజ్‌లో ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా ఆయనను 'ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్' అనే బిరుదు ఇచ్చారు. ఇప్పుడు మరో సంచలన దర్శకుడు ఆదిత్య ధర్ ఏకంగా 'ది లెజెండ్' అని ట్యాగ్ ఇవ్వడంతో.. రెబల్ స్టార్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ రచ్చ చేస్తున్నారు. ఆదిత్య ధర్ లాంటి దర్శకులు ప్రభాస్ పట్ల చూపిస్తున్న ఈ గౌరవం చూస్తుంటే, ఆయన కేవలం




## మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి




## దసరాకు రిలీజ్ చేసేలా .. ఫౌజీ షూటింగ్ స్పీడ్

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో




## కొరియన్ కనకరాజు నుంచి 'కమ్సాహంనిదా' పాట ప్రోమో




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో–కొరియన్ నేపథ్యంలో హారర్–కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.